# దాక్షిణ్య లోభం

"ఏమండీ, ఇంకా నిద్రపోతున్నారా? వాళ్లుపీటల మీద కూర్చొంటున్నారు" అంటూ లేపింది, తెల్లవారు జామున విడిదిలో నిద్రపోతున్న నన్ను కరుణ.

"అప్పుడే ముహూర్తపు వేళ అయిందా" అన్నాను.

"కాలేదుటండీ... 4 గంటలయింది ఇదిగో మీ బ్రెష్, నీళ్ళు. త్వరగా ముఖం కడుక్కోండి" అంటూ పెళ్ళి యింటికేసి వెళ్ళింది కరుణ. పళ్ళు తోముకోవటానికి లేచాను. పెద్దగా మేళతాళాలు, మెల్లగా మంత్రాలు విన్పిస్తున్నాయి. క్షణ కాలం స్థంభించిపోయినట్లు నిలచిపోయాను.

వివాహం జరిగిపోతున్నది శేషుకు, రమణికి. పెళ్ళి కూతురూ, పెండ్లికొడుకూ - యిద్దరూ నాకు అయినవారే!

మేళాలు ఆగిపోయాయి. మంత్రాలే విన్పిస్తున్నాయి. బంధువులంతా త్వర త్వరగా పనులు ముగించుకుని పెళ్ళి పందిరికేసి నడచి వెళ్ళిపోయారు. నే నొక్కడినే మిగిలిపోయాను, చేతిలో బ్రెష్‌తో.

వివాహమంటే ఎంతటి ప్రయత్నం.....? ఎంతమంది సంకల్పం....? - ఆలోచనలో పడి పోయాను క్షణ కాలం. గాలిలా వచ్చేసింది కరుణ. నీరులా కారి పోయింది నన్ను చూచి.

"అబ్బా! మీరింకా మీనమేషాలు లెక్కపెడుతూ ఇక్కడే వున్నారా! అక్కడ అంతా పెళ్ళి పందిటిలో చక్కగా బట్టలు వేసికొని కుర్చీలలో కూర్చొని పెళ్ళి

చూస్తూ సరదాగా కబుర్లు చెప్పుకొంటున్నారు." అంది కరుణ.

కరుణ కేసి అదోలా చూచాను - "కరుణా, పెళ్ళి జరగాలంటే యింతమంది అక్కడ వుండాలా?"- అన్నాను.

కరుణ విస్తుపోయింది.

"భలేవారండి! మీరు మరీనూ!.... మీ ప్రశ్నలకు సమాధానాలు చెప్పగలదాన్ని కాదు కాని, తమరు నాయందు దయవుంచి తెమలిరండి. ఇవిగో, ఈ బట్టలు వేసికొని త్వరగా వచ్చి వేయండి" అంటూ వెళ్ళిపోయింది కరుణ.

పళ్ళు తోముకోవటం ప్రారంభించాను. ఆలోచనలు పలువిధాలుగా పరువెత్తు తున్నాయి. మధ్య మధ్య మంగళ తూర్యారావాలు నా భావనాంబర వీథిలోని, ఆలోచనలకు క్షణ కాలం అడ్డు నిలచి తప్పుకుంటున్నాయి.

పెళ్ళికి రావద్దనే అనుకొన్నాను. కాని భుజంగరావు మామయ్య, "బాబీ, నీవు ఈ పెళ్ళికి అమ్మాయితో కూడా వస్తే మా చెల్లాయి వచ్చిందనుకొంటాను." అని వ్రాసారు. పాపం! మామయ్యకు 'అమ్మ' అంటే ప్రాణం. అలాంటి మామయ్య మనస్సు కష్టపెట్టటం ఇష్టంలేక వచ్చాను. లేకుంటే ఈ మధ్య - అంటే కరుణ వచ్చాక - ఏ శుభకార్యానికి ఎవరి యింటికి వెళ్ళాను కనుక!

ఈ పెళ్ళికి మాత్రం.... నిన్న తీరా పెళ్ళివారు గుంటూరులో తరలి బయలుదేరపోయే పాటికి కరుణా, నేను, వాళ్ళలో కలిసాం. అత్తయ్య.. మొఖం ముడిచేసుకొన్నా, మామయ్య పొంగిపోయాడు.

"ఏరా శేషూ! రీసెర్చి ఎలా వుంది?" అని ప్రశ్నిస్తే పెళ్ళికొడుకు పోజులో నల్ల కళ్ళద్దాలలోనుండి చూచి, "ఎలా వుందని చెపితే నీకు అర్థమౌతుంది?" అన్నాడు తన మిత్రుల కేసి చూచి నవ్వుతూ.

అంతా గొల్లుమన్నారు.

వాడి ఉద్దేశం'రిసెర్చి'ని గురించి ప్రశ్నించటం, నా బి.ఏ. చదువుకు మించినపని అని.

రైలులో మామయ్య ఎక్కిన పెట్టెలోనే ఎక్కాను. ఏవో ఆయనతోనే కబుర్లు చెప్పుకొంటూ గడిపేసాను.

ఆలోచనలనుండి తేరుకొని బట్టలు వేసుకొన్నాను.

కరుణ మళ్లీ వచ్చేసింది.

"అబ్బా! ఇదేమిటండీ, ఆ బట్టలు వేసికొన్నారు. ఆ గ్లాస్కోపంచ, టెర్లిన్ చొక్కా అక్కడ పెట్టెమీద పెట్టి వెళ్ళానుగా..." అంటూ తీసి ఇచ్చింది.

"కరుణా! పెళ్లి శేషుదీ, రమణదీనూ......." అన్నాను.

కరుణ, క్షణ కాలం నిశ్చేష్ఠిత అయి నాలోకి చూచింది. నిశ్చలంగా. ఆ చూపులో ఎంతటి స్మృతి, ఎంతటి వెలితి తొంగి చూచిందో, ఎంతటి నిర్వేదనాభారం సుళ్ళు తిరిగిందో!

"ఏమండి! నా మాట మన్నించి, ఈ బట్టలు వేసికోరూ--!" అంది కరుణ. ఎంతటి దీనత గోచరించిందో ఆ మాటలలో. పెళ్ళికి వచ్చిన నలుగురి ప్రక్కగా నన్నూ ఒకవాడిని చేయాలనే కరుణ ప్రయత్నాన్ని కాదనలేకపోయాను.

కరుణ మోము వికసించింది.

"త్వరగా బయలుదేరి రండి. మంగళ సూత్రధారణ జరగబోతోంది" అంటూ బయలు దేరదీసింది కరుణ.

ఎలక్ట్రిక్ దీపాల కాంతిలో తళ తళా మెరసిపోతోన్న కల్యాణ మంటపం, చుట్టూ చాందినీ గుమ గుమలు. ఆ చుట్టూ వలయాకారంగా వేసిన సోఫాలు మధ్యన పరుపపడ్డ కార్పెట్టు. దానిపైన ఆసీనులైయున్న స్త్రీజన సముదాయం-విలాసంగా సోఫాల మీద ఆసీనులైన వివిధ హోదాల పెద్దలు. ఒక ప్రక్క మేళగాండ్రు.... వెలిగిపోతోంది పెళ్ళిపందిరి. దానిలో ఒక ప్రక్క నేనూ కలిసి పోయాను.

వియ్యాలవారు శ్రీమంతులు. తమ హోదాకు తగ్గట్టుగానే ఏర్పాట్లు చేసారు. పందిటి నాలుగు మూలలనుండి వేళాకోళాలు, విసుర్లు, పరిహాసాలు, వారి వారి స్థాయిని బట్టి వినవస్తున్నాయి. ఆడవారిలో గుసగుసలు, మధ్య మధ్య ఎవరో ఎవరినో మరెవ్వరికో పరిచయం చేయటంలాంటి పనులు.

ఇతను రఘుపతి - ఫలానావారి అబ్బాయి, ఫలానావారి అల్లుడు - అంటూ నా ప్రక్క వ్యక్తిని ఎవరికో పరిచయం చేస్తున్నారు. 'అలాగా' అంటున్నారు ఆయన.

మంగళసూత్రధారణ జరుగుతోంది. వధువు జడను పట్టుకొన్నదో ముత్తయిదువ. శేషు మంగళసూత్రధారణ చేయటానికి సిద్ధమయ్యాడు.

"గట్టిగా ముడివెయ్యరోయ్" అని కేకవేసారెవరో.

కెమెరా బల్బుల దీప్తి ముంచెత్తింది కల్యాణ మంటపాన్ని.

నా దృష్టి, ఆడవాళ్ళలో కూర్చొని వివాహాన్ని తిలకిస్తున్న కరుణ మీదకు మళ్ళింది. కరుణ దృష్టి క్షణ కాలం నాపై ప్రసరించింది.

ఏమిటో ఈ స్మృతి దాక్షిణ్యత? నా తలపులు రెండు సంవత్సరాల వెనుకకు పరువెత్తి నిలిచిపోయాయి.

★ ★ ★

ఆనాడు 'కరుణ' మెడలో నేను మంగళ సూత్రం కట్టిననాడు ఎందరు వీక్షించి సంతసించారు-? ఎన్ని కెమెరాలు వెలిగిపోయాయి? ఏమీ లేదు! నాకు బాగా గుర్తు. గుర్తేమిటి నేను ఈ జీవితాంతం మరువలేనిది. కరుణ నాతో వచ్చేసాక ఆనాటి సాయంత్రం పసుపుకొమ్ము దారంతో కట్టి తీసికొనివచ్చి, "ఇది కట్టరూ!" అని అడిగింది.

"కరుణా మనలను బంధించటానికి ఇది మాత్రం కావాలీ?" అని అడిగాను.

అదోలా చూచించి నాలోకి. రెండే కన్నీటి కణాలు కన్పించాయి కరుణ కనులలో.

"నా సౌభాగ్యం" అని ఏదో మూగగా అంది. ఆనాడెవరూ చూడలేదా ముహూర్తాన్ని. మంగళ తూర్యారావాలు మార్మోగనూ లేదు.

★ ★ ★

గతం నుండి వచ్చేపాటికి, తలంబ్రాలు పోసికొంటున్నారు శేషు. రమణి. చుట్టూ చేరినవారంతా ఎంతో ఉత్సాహంగా, వేడుకగా వధూవరులను గేలిచేస్తు న్నారు. బహుశా నేనేనేమో ఏమీ మాట్లాడనివాణ్ణి.

కట్నాలు, చదివింపులూ ప్రారంభమయ్యాయి.రిస్టువాచి, ఉంగరాలు, పట్టు బట్టలు, వెండి పళ్లెం, మరచెంబు - ఆ వెండి పళ్ళెంలో పెద్ద మొత్తం కట్నంగా వధువు తండ్రి జామాతకు సమర్పించి చేతులు దులుపు కొన్నాడు.వధు వు కు

నెక్లెస్, బంగారపు గొలుసు, జడబిళ్ళ,పట్టు చీరెలు మామయ్య చదివించారు.

నా కళ్ళొకసారి కరుణ మెడ వైపుకు వెళ్లాయి. నిండుగా చీరె కప్పుకొని కన్పించింది కరుణ.

పురోహితులు బిందెలో అంగుళీయకంవేసి తీయమంటున్నారు. చుట్టూ చేరిన వారంతా పరాచికాలాడుతున్నారు. శేషు 'నన్ను గిచ్చింది' అంటూ చేయి పైకి తీసాడు. అంతా గొల్లుమని నవ్వారు; పెళ్ళి కూతురు 'నన్నేగిచ్చారు' అన్నది.

అంతా వేడుక!

మంగళ హారతి పాడారు. హారతి పళ్ళెంలో వెలిగిపోతోన్న జ్యోతి కేసి చూచాను. ఆ దీప్తి నన్ను 'నీవేదో పోగొట్టుకొన్నావు' అన్నట్లు హెచ్చరించింది. అవును వివాహమనే మనోహర ఘట్టాన్ని, ఆ మధుర క్షణాలను అనుభవించ లేకపోయాను.

అమ్మ ఆనాడు అన్న మాటలు జ్ఞాపకాని కొచ్చాయి- "చిన్నవాడివి... గారాబంగా పెరిగావు, నీ వివాహం అతి వైభవంగా చేదామనుకొన్నాను..... చివరికిలా అవుతోంది--" అని.

ఆనాడు నాకు ఆ వైభవం ఏమిటో అర్థం కాలేదు. అమ్మ కోరుకొన్న దేమిటో పిచ్చిగా కన్పించింది.

నా ఆలోచన మరోసారి రెండు సంవత్సరాల నాటి జీవితం వైపు మళ్ళింది.

★ ★ ★

అప్పట్లో బి.ఎ. పాసయి విజయవాడలో ఉద్యోగం చేస్తూ వుండేవాడిని. నాన్నావాళ్ళు పెళ్ళి ప్రయత్నాలు జరుపుతూ వుండేవారు. రెండు మూడు రోజులకో సంబంధం చూచి రమ్మంటూ వుండేవారు.

అప్పట్లో నేనుంటోన్న ప్రక్కింటిలో వున్న ఎలిమెంటరీ స్కూలు మాస్టారి అమ్మాయి 'కరుణ' మీద నా దృష్టి నిలచింది. కరుణ మెట్రిక్ పాసయింది. హిందీ ప్రవేశిక పాసయింది. కరుణ తండ్రి శివకామయ్య మాష్టారు కట్నాలు ఇచ్చు కోవటానికే కాదు, పెళ్ళి చేయటానికి కూడ శక్తి లేనివారు. ఈడు వచ్చిన పిల్లను గుండెల మీద పెట్టుకొని దిక్కు తెలియక బాధపడుతున్నారు.

కరుణలోని ప్రత్యేకతలు నన్ను ఆకర్షించాయి. ఆమె మధుర హృదయం నన్ను కట్టివేసింది. కామయ్య మాష్టారు అనుభవాల ఖని.ఆయనతోటి నా పరిచయం, వారింటిలోని వ్యక్తినే అనుకొనే వరకు తెచ్చింది.

జీవితంలో ఒక్కటైనా మంచిపని చేదామనే నాలోని ఒక ఉత్సుకత, కరుణను వివాహ మాడదామనే - నిర్ణయానికి దారి తీసినా- ఒక 'మంచి వ్యక్తిత్వం గల"స్త్రీని నా దానిని చేసికోదలచిన స్వార్థమూ లేకపోలేదు.

'నన్ను పెండ్లి చేసికొంటావా?' అని నేను కరుణను అడిగిననాడు, కరుణ' పొంగి పొరలి కట్టు తెంచుకొని వెల్లువ ప్రవాహమే అయింది.

కంకిపాడు వెళ్ళి సంబంధం చూచి రమ్మన్న నాన్న జాబుకు, జవాబుగా 'నా కరుణ'ను చూపాను. ఆయన మండిపడుతూ జాబు వ్రాసారు.

"పెద్దల మేము వున్నామని మరచిపోకు. కోరి కోరి ఏ దారిద్ర్యదేవతనో ఆహ్వానించకు. నీ విలువ వేల రూపాయలని, ఆ వేల విలువ, అంతటికన్నా గొప్పదని గ్రహించలేని అవివేకివి అనుకోను" అంటూ జాబు వచ్చింది.

కరుణ దీనంగా చూచింది.

నా నిశ్చయాన్ని తిరిగి వ్రాసాను. ఈసారి నాన్నే వచ్చారు. ఇటు కనిపెంచిన తల్లి దండ్రులు, అటు కరుణ అనే దారిద్ర్యపు బొమ్మ. ఏదో ఒకటి తేల్చి నిర్ణయించుకోమన్నారు.

నా నిర్ణయాన్ని విన్న నాన్న "మాతో నీ కెలాంటి సంబంధం లేదు -" అని వెళ్లి పోయారు.

ఆ సాయంత్రం ఒంటరిగా గదిలో కూర్చుని వున్నాను. శివకామయ్యగారు వచ్చారు.

"నాయనా! వివాహమంటే వెయ్యేళ్ళ పంట. అందరి ఆదరణ, అనుమతి, అభిమానము వుంటేనే దానికి ధన్యత... మీ వాళ్ళకి ఇష్టం లేనిది ఎందుకు?" అన్నారు.

నా కర్థమయింది, నాన్న శివకామయ్యగారిని కలుసుకొన్నారని.

"ఇలాంటి పరిస్థితులలో నా కిష్టం లేదు నాయనా" అన్నారు ఆయన.

కాని కరుణ, నేను వేరు కాలేము - ఈ విషయంలో నాన్న నిర్ణయమెంతటిదో శివకామయ్యగారి నిర్ణయమూ అంతటిదే.

చివరిసారిగా, నాన్నకు నచ్చచెప్పాలని ఇంటికి వెళ్ళాను. నా ప్రయత్నం పరిస్థితులను విషమపరచిందేకాని మరెందుకూ ఉపయోగించింది కాదు ఈ జన్మకూ, 24 సంవత్సరాల ఈ జీవితానికీ కారణభూతులైన తల్లి దండ్రులనుండి, ఆగ్రామం నుండి బంధాలను త్రెంచుకొని తిరిగివచ్చివేసాను.

ఒక మంచి రోజు చూచి కరుణను వచ్చివేయమన్నాను నా దగ్గరకు. కరుణ శివకామయ్యగారికి అక్షింతలు యిచ్చి నమస్కరించిందట. యాంత్రికంగా ఆయన కరుణ శిరస్సుపై వాటినుంచి, అలాచూస్తూ వుండిపోయారట.

శివకామయ్యగారు మాత్రం ఏం చేస్తారు? ఆనాటికి, ఆయన జీవితకాలం శ్రమించి, జీవించగల్గారంతే! ఆయనకున్న ఆస్తి సర్వస్వం 'కరుణే'!

నాతో వుండిపొమ్మన్నాను. "వద్దు నాయనా-" అంటూ వేరుగానే వుండిపోయారు.

నెలన్నా నిండా తిరగలేదు. ఇద్దరు ఆత్మీయులు ఇహాన్ని వదలి పరానికి వెళ్ళిపోయారు. ఒక జీవితకాలం కష్టాలనే చవిచూస్తూ, జీవితాన్ని ప్రతి క్షణానా సమస్యగా, భారంగా, సాగతీసిన శివకామయ్యగారు దాటిపోవటం అంత ఆశ్చర్యాన్ని కొల్పలేదు. పండిన పండు రాలిపోయింది అనిపించింది. నిండుగా 50 సంవత్సరాల జీవితాన్నైనా గడపని అమ్మ గతించటం, ఎంతటి దుర్విధి?

త్రెంచుకొన్న బంధాలు బాహ్యమైనవే! కర్మాంతరాలకు కరుణతో వెళ్ళాను. ఢిల్లీ నుండి అన్నయ్య, గుంటూరు నుండి మామయ్య వచ్చారు. ఆ పదమూడు రోజులూ గడచిన మరుక్షణాన, నాన్న అన్నారు.

కరుణ నా తల్లిపట్ల మృత్యు దేవతట మేమిద్దరం తన కన్యాయం చేశామట.

"ఈ జీవితంలో మిమ్మల్ని చూడవద్దను కొన్నాను. అసలు మీరే లేరను కొన్నాను" అన్నారు నాన్న.

మామయ్య వారించారు నాన్నను.

ఒక్కసారి నిట్టూర్చి కన్నీరు మున్నీరై కుమిలిపోతున్న కరుణను తీసికొని

వచ్చివేసాను. ఆ తరువాత నాన్న ఢిల్లీ వెళ్ళిపోయారు.

★ ★ ★

కరుణ, "ఏమండీ మిమ్మల్నే!" అనేసరికి ఆలోచనల నుండి తేరుకొన్నాను. పందిరి అంతా ఖాళీ అయింది. అంతా లేచి వెళ్ళారు.

"ఏమండీ, ఒంటరిగా ఇక్కడ కూర్చుని ఏం చేస్తున్నారు? అంతా విడిదికి వెళ్ళిపోయారు."

పెళ్ళి పందిరి అంతా తిరిగి చూచి, బయలుదేరాను. చేతిలో అక్షింతలు పురోహితులు లాగిచ్చారో అలాగే ఉండిపోయాయి. కరుణ తల మీద వేసాను.

టప టపమంటూ రాలిపోయిన కన్నీటి కణాలను, నాకు కన్పించకుండా దాచుకోవాలని కరుణ చేసిన ప్రయత్నం విఫలమైంది నాపట్ల. విడిదికి తిరిగి వచ్చేసాము.

భుజంగరావు మామయ్య హడావిడిగా ఎక్కడికో వెళుతూ, "ఏరా నాయినా, మురారీ! ఫలహారాల వేళకు ఎక్కడకు వెళ్ళావు-" అన్నారు.

"ఇక్కడే వున్నాను మామయ్యా!" అన్నాను.

ఇయన కంటి వెంట కన్నీరు రాలిపోయింది. "మీ అమ్మే వుంటే నిన్ను కనుక్కొనేవారే లేకుండా వుండేవారా!" అన్నారాయన.

ఆ రక్త బంధు కేమందును?

"అదేమిటి మామయ్యా.... నన్నొకరు కనుక్కోవాలా....?" అన్నాను.

ఎవరో పిలవటంతో మామయ్య వెళ్లి పోయారక్కడనుండి.

కరుణ కాఫీ తెచ్చి ఇచ్చింది.

అప్పటికప్పుడే పేకాట గ్రూపు లేర్పడ్డాయి విడిదిలో. విశ్రాంతి లభించిందిలా వుంది పెళ్ళికొడుకు 'శేషు' కూడా పేకాటలో కూర్చొన్నాడు.

"మురారీ వస్తావా?" అన్నాడు కృష్ణ

"ఓ" అన్నాను.

"నీవు ఆడే ఆటకాదులే," అన్నాడు శేషు జేబులోనుండి పైకం బయటికి తీస్తూ.

"అవును!" అంటూ వెళ్ళిపోయానక్కడనుండి.

కరుణ నాకో పుస్తకం ఎక్కడో సంపాదించి తీసికొనివచ్చి మామయ్య కోసం ఏర్పాటు చేసిన గదిలో ఓ పడక కుర్చీ చూపించి, 'ఇక్కడ కూర్చోండి, భోజనా లప్పుడువచ్చి పిలుస్తాను" అని వెళ్ళిపోయింది.

పుస్తకం తెరిచాను. కాని మనసు దానిమీద లగ్నం కాలేదు. పరి పరి విధాల విహరించింది. ముఖ్యంగా ఈ వివాహ వ్యవస్థపైన. పురోహితులు, వరునిచేత ప్రమాణం చేయించిన ఘట్టాలు జ్ఞాపకానికొచ్చాయి.

'నాతిచరామి' అనే వరుని ప్రమాణ వచనం, ఎంతటి పవిత్రమైనది! గంభీరమైనది! ఈ వివాహ వ్యవస్థ ఎంత మహత్తరమైనది!

కరుణ నా భార్య అయిననాడు ఎవరు చెప్పారీ వేద ప్రమాణాన్ని? ఎక్కడ వెల్గింది, అగ్ని, "సాక్షి"గా?

"ఇక్కడ ఉన్నావటరా, నాయనా," అంటూ వచ్చారు మామయ్య. లేచి, మామయ్యకు కుర్చీ ఇచ్చి, ప్రక్కనున్న బల్లమీద కూర్చొన్నాను. భోజనాలకు ఇంకా వ్యవధి వుంది. ఏదో పిచ్చాపాటిలో పడ్డాము. నా ఉద్యోగం, ఆఫీసర్లు, వారి మనస్తత్వాలు, ఇలా ఇలా సాగింది మా ప్రసంగం. చివరికి ఈ సంబంధం ఎలా కుదిరిందీ చెప్పారు మామయ్య.

"ఏమోరా, నాయనా! కట్నాలు, కానుకలు అంటే నాకు ఇష్టం లేదు. మన ఇంటికొచ్చి, మన నట్టింట దీపం వెల్గించే మహాలక్ష్మిని స్వీకరిస్తూ, ఏమిటివన్నీ, చెప్పు... అయినా మీ అత్తయ్య పట్టుపట్టింది కట్నాలంటూ; శేషు తనకేవో కావాలన్నాడు. మీ అత్తయ్య అడిగింది. వాళ్ళు ఇస్తామన్నారు. నేను ఏమీ అనలేదు. ఇంతకూ ఘటన వుంది. సరిపడింది. నాయనా! ఒక్కడు, నాకు. వాడి సౌభాగ్యం కన్నా నాకు కావలసిందేముంది చెప్పు?" అన్నారు మామయ్య.

"రావలసినవారంతా వచ్చారు నాయనా ఈ పెళ్ళికి. కాకపోతే, కాలం తీసికొని పోయిన మీ అమ్మ, దూరదేశాన వున్న మీ నాన్న తప్ప; ముఖ్యంగా నీవు వచ్చావు... నా కదే తృప్తి" అన్నారాయన.

అంతలోనే అత్తయ్య, "సరే, మీరిక్కడ వున్నారటండీ!" అంటూ వచ్చి,

"లెండి త్వరగా, అక్కడి నుండి పిలుపు వచ్చింది" అంది మామయ్య నుద్దేశించి. నన్ను చూడనట్లే నటించి వెళ్లింది.

'ఆర్థికమైన అంతస్థులను చూచుకొని మనుషులిలా ఎందుకు ప్రవర్తిస్తారా' అనిపించింది.

కరుణ వచ్చింది భోజనానికి లెమ్మంటూ. భోజనాలయ్యాక విశ్రాంతట. సాయంత్రం మేజువాణి. మేజువాణి తరువాత పాన్పు, తరువాత ఊరేగింపు, ఆ తరువాత తెల్లవారు జామున అప్పగింతలు - కార్యక్రమాన్ని వివరించింది కరుణ. ఏమిటో ఇవన్నీ.

భోజలనాలయ్యాయి. సాయంత్రం మేజువాణి అయింది. వెంటనే పాన్పట. దూరంగా పందిటిలో కుర్చీలపై మామయ్యా, నేనూ కూర్చొన్నాము. ఆయన ఏవో చెపుతున్నారు, తిరిగి వెళ్ళాక చేయవలసిన పనిని గురించి. వధూవరులచేత దంపతులకు తాంబూలాలు ఇప్పిస్తున్నారు. అదంతా వేడుక. భార్యాభర్తలు జంటలుగా వెళ్ళటం వధూవరులు ఇచ్చే తాంబూలాలు తీసికొని వాళ్ళను కల కాలం వర్ధిల్లమని ఆశీర్వదించటం; ఈ తంతులో వైదికతత్వం కన్నా , సాంఘిక వినోదం మధురమైనది.

ఓ పెద్ద ఇల్లాలు, పురోహితులు, "రండర్రా మీరు, మీరు -" అని దంపతులను పేర్లెట్టి పిలవటం, వాళ్లు గుబుక్కున తమ దాంపత్యం జ్ఞాపకం వచ్చినట్లు, ఎంతో సిగ్గుపడుతూ వెళుతూ వుండటం; అప్పటివరకూ ఈ వినోదాన్ని తిలకిస్తూ, ప్రక్కవారిని ఉడికించిన మరో జంటకు పిలుపు రావటం, వాళ్లు గతుక్కుమనటం - అంతా ఓ మధురానుభూతి!

దంపతులంతా తాంబూలాలు పుచ్చుకొన్నారు. నా పక్కనే వుండి ఈ వేడుకనంతా తిలకిస్తూ మామయ్య, "నాయనా! నీవు, అమ్మాయీ వెళ్ళలేదేమర్రా" అంటూ హడావిడిగా, అత్తయ్యను, "ఇదిగో మన మురారి, కరుణా మిగిలిపోయారు" అని కేక వేసారు.

".......... పోనిద్దూ మామయ్యా" అన్నాను.

"అదేంటిరా....లే" అని బలవంతం చేసారు. లేవక తప్పింది కాదు. అక్కడ కరుణ సిద్ధమౌతోంది - పై చెరగును మెడ చుట్టూ కప్పుకొంటూ,

కాని, ఏ సాంఘిక మధురతను ఆస్వాదించ తలచుకొన్నానో, ఆ మర్యాదలకు తగిన సాంఘిక అంతస్తు నేను కోల్పోయానని అత్తయ్య ఎత్తి చూపించినట్లు పురోహితునితో, "ఇంక ఎవ్వరూ లేరు, తతిమ్మా తంతు కానివ్వండి" అంది.

కరుణ అలాగే తెల్లబోయి నిలబడి పోయింది. లేచి నిలబడిన నేను అలాగే ఆగిపోయాను. అవును! అత్తయ్య ఆశించే సాంఘిక, వైదిక అంతస్తు నాకు లేదు.

అంత దూరం నుండి కరుణ లేమోము నుండి నిష్క్రమిస్తున్న కాంతిరేఖలను ఒక్కొక్క దానినే చూడగల్గాను.

మామయ్య లేచి వెళ్ళారక్కడ నుండి. మరి కొద్దిసేపటిలో అక్కడ హడావుడి ముగిసిపోయింది. అక్కడ కరుణ కన్పించలేదు.

విడిది కేసి బయలు దేరాను. మామయ్యకు నిర్దేశింపబడిన గదిముందుగా వెళ్లటం తటస్థించింది.

"వాళ్ళు నా కోసం వచ్చారు. వాళ్ళను అవమానపరిస్తే నన్ను అవమాన పరిచినట్లు కాదా?" అంటున్నాడు మామయ్య.

"మీరేమయినా అనండి; వాళ్ళకి దంపతి తాంబూలాలు తీసికొనే అర్హత లేదు. ఏం, ఎవరు కన్యా ధారపోసారని వాళ్ళిద్దరూ దంపతులంటారు? మీకు వాళ్ళు ఆత్మీయులైతే, మణిమాన్యాలిచ్చుకోండి. అంతే కాని, శుభమా అంటూ జరిగే పెళ్ళిలో....." అంటూ అత్తయ్య ఏదో అంటోంది.

మామయ్య ఖిన్నుడై నెత్తి, నోరు మొత్తుకొంటున్నాడు. ఆ బంధు సముద్రుని హృదయవేదన కట్టలు తెంచుకొంటోంది.

కరుణ దగ్గరకు వెళ్లాను. ఆ వాడిపోతున్న మోముతో చిరునవ్వు నవ్వటానికి ప్రయత్నించింది. ఏమీ ఎక్కడా జరగనట్లే ప్రవర్తించింది.

"ఊరేగింపుకు అంతా రెడీగా ఉన్నారు. మీరూ-"

"వద్దు కరుణా.... తలనొప్పిగా వుంది" అన్నాను పరచివున్న బెడ్డింగు మీద పండుకొంటూ.

"పెట్టెలో అమృతాంజనం వేసికొని రావటం మరచాను. పోనీ ఎవరిదగ్గరైనా దొరుకుతుందేమో తీసికొని వస్తాను" అంది.

మానసికమైన ఘాతాలకు, భారాలకు మందు నిష్ప్రయోజనమని కరుణకేం తెలుసు.

"వద్దు కరుణా.... బట్టలు సర్దు - రైలుంది. వెంటనే వెళ్లిపోదాం" అన్నాను.

కరుణ తెల్లపోయింది. నా కనులలోని నిర్ణయాన్ని పసికట్టిన కరుణ మారు మాట్లాడకుండ పెట్టే, బెడ్డింగు సర్దింది. రిక్షాను పిలచుకొని వచ్చాను. 8-30 గంటలయింది.

"పోనీ మీ మామయ్యకు, అత్తయ్యకు ఓసారి చెప్పి రాకూడదూ-" అంది కరుణ.

అప్పటికే అందరూ ఊరేగింపుతో వెళ్ళారు.

"వద్దు కరుణా! అలా అయితే అసలు వెళ్లలేం" అంటూ బయలుదేరతీసాను.

★ ★ ★

నర్సరావు పేటకు తిరిగి వచ్చాక మనస్సొక విధంగా వుండి ఆఫీసుకు మరో రెండు రోజులు సెలవు పెట్టి, ఇంటి పట్టునే వుండిపోయాను. మనస్సును బాధాకర మైన ఒక భావక్షేత్రం నుండి త్రిప్పాలని నే చేసిన విఫల ప్రయత్నాలు - పుస్తకాలు చదవటం, మిత్రులకు జాబులు వ్రాయటం, ఏనాడో అసంపూర్తిగా వదిలివేసిన నవల పూర్తి చేయాలనుకోవటం.

నరసరావు పేటకు తిరిగి వచ్చిన మూడవ రోజు ప్రొద్దున స్నానం చేసి, ఏదో చదువుతూ గదిలో మంచం మీద పండుకొన్నాను. కరుణ ఎప్పుడు పెట్టిపోయిందో కాఫీ ప్రక్క టేబిలు మీద, మళ్లీ తిరిగి వచ్చి- "అయ్యో! కాఫీ ఆరిపోయింది.... ఇంకా మీరు...." అంది.

లేచి కరుణ కేసి చూచాను. కరుణ నా కనులలోకి లోతుగా చూచి, "ఏమండీ, ఎందుకిలా అయిపోతున్నారు?" అంది.

"అబ్బే, ఏముంది-" అన్నాను.

పాడిగా నవ్వింది. "నాకు తెలుసు మీ బాధ" అంటూ, మంచం మీద కూర్చొని నా తలను తన ఒడిలోకి తీసుకొంది. పిల్లవాడిలా అయిపోయా నా పరిష్వంగంలో ఒదిగిపోతూ.

"చూడండి. ఈ విశ్వంలో ఎన్ని చరాచర జీవరాసులున్నాయి. ఎంతమంది వ్యక్తులున్నారు. అంతా ఒకే స్థితిలోను, స్థాయిలోను ఉన్నారా? అందరి జీవితాలు సర్వ సంపదలతో తులతూగుతున్నాయా - ప్రతివారూ, ఆరముగ్గిన అదృష్టాలనే అంది పుచ్చుకొంటున్నారా...."

"అదికాదు కరుణా...."

"మీ భావం నాకు తెలుసండి.... నిజమే! శాస్త్రీయ వివాహమనే, ఒక మహోన్నత అదృష్టాన్ని కోల్పోయాం; జీవితంలో ఎంతో కోల్పోవటానికి సిద్ధపడే మీరు నన్ను స్వీకరించారు. మీరు నన్ను కోరింది మనస్ఫూర్తిగానే కాని, ఏదో ఆదర్శ ప్రదర్శనకు కాదు - దీనిని మీరు కాదన్నా.... నేను అంగీకరించలేను.

"ఇటు చూడండి! మీ హృదయ పరిణతిని మనోవలయంలో ఇముడ్చుకో కల్గిచే కసారీ పని... ఈనాడైనా మీరు నా కోసం బాధ పడుతున్నారు. వైదిక ధర్మ యుక్తమైన వివాహం జీవితాలకు పుష్టినిస్తుంది. నవ దంపతులకు కర్తవ్యాన్ని బోధిస్తుంది. వాళ్లను కర్మరక్తులుగా చేస్తుంది. మనం అలాంటి అదృష్టానికి నోచుకోలేదు. కాని ఆ వైదిక ధర్మ యుక్తమైన వివాహంలోని పరమార్థాన్ని గ్రహించి జీవించగల్గితే, ధన్యులం కాలేమంటారా?" అంది కరుణ.

కరుణ కనులలో కాంతి పుంజాలను పుంఖాను పుంఖాలుగా చూచాను. అర్థంకాని బాధావీచికల ప్రోవులో చుట్టుకొన్న నన్ను కరుణ బయటకు తీసి రక్షించినట్లు అనిపించింది. అప్రతిభుణ్ణయి కరుణకు సమాధానం చెప్పగ స్థితి, శక్తి లేక ఉండి పోయాను.

"పురాణాలు, వేదాలు, మనకు ప్రమాణాలు. అవి మన సంస్కృతి. ఆ సంస్కృతిని జీర్ణించుకొన్న వ్యక్తికి గీటురాళ్లు లాంటివి చిత్త సంస్కారాలు. అలాంటి మహోన్నత చిత్త సంస్కారాన్ని మనం అలవరచుకొంటే అదే తృప్తి. ఏం! ఆనాడు, మీరు 'నాతిచరామి' అనకుంటే మాత్రం ఈనాడు, నా మాటకు మీరు విలువకట్టరా.... మీరు నా వారు కారా?" అని ప్రశ్నించింది కరుణ.

కరుణలోని ఆత్మవిశ్వాసం నాలో కొత్త రక్తాన్ని అందించింది.

నా కనుల వెంట రెండు బాష్పాలు రాలిపోయాయి.

★ ★ ★

ఆ మరునాడు ఆఫీసుకు వెళ్ళాను. మామయ్య దగ్గరనుండి జాబు వచ్చి వుంది.

మురారీ!

నీవు 'ఆఫీసు పని వుంది, త్వరగా వెళ్లవలసి వెళుతున్నా'నని చీటీ వ్రాసి అక్కడ పెట్టి వెళ్ళినా, నీవు ఎందుకు వెళ్ళిపోయిందీ నాకు తెలుసు నాయనా! నీకు జరిగిన అవమానాన్ని, అన్యాయాన్ని చూచి సహించగల్గిన మామయ్య మొహం చూడలేక వెళ్ళిపోవటం న్యాయమే! కాదనను; వెళ్ళిపోయావేమో, అదృష్టవంతుడివి. లేకుంటే అంతటి కన్నా ఘోరమైన సన్నివేశాన్ని చూడవలసి వచ్చేది.

నా కొక భార్య - ఉన్నత విద్య నభ్యసిస్తున్న కొడుకు వున్నారు. కాని వాళ్ళవి చిన్న హృదయాలు. నా బాధ నీకు చెప్పుకుందామని వ్రాస్తున్నాను.

అప్పగింతలు దగ్గర ఏదో పేచీ పెట్టుకొంది మీ అత్తయ్య. శేషు తాళం వేసాడు. ఆ కల్యాణ మంటపం కోపతాపాలకు, అభిజాత్యాలకు శిబిరమయింది. మీ అత్తయ్య పెళ్ళి కూతురిని వదిలివేసి వెళ్లాలంది. అగ్నికి ఆజ్యం పోసారు మరి కొందరు. అంత టి ఉన్నత విద్య సభ్యసిస్తున్న శేషు జ్ఞానలవదుర్విదగ్ధంగానే వ్యవహరించాడు.

కూలిపోతున్న పరువు ప్రతిష్ఠలను కాపాడాలని, జారిపోతున్న వాళ్ళ వివేకాన్ని మేల్కొల్పాలని, నేను చేసిన ప్రయత్నం బుగ్గిపాలయింది.

నాయనా! నీకు తెలుసుగా, వారి ముందు నేనెంత అశక్తుడినో! నా ప్రయత్నాలు నీరు కారిపోయాయి.

తెల్లవారేసరికి ఇక్కడకు చేరాము, పెళ్ళి కూతురిని అక్కడే వదిలివేసి. ఎంతటి ధనధాన్యాలుండి, చదువుసంధ్య లుండి ఏం ప్రయోజనం!

"అష్టవర్షాభవేత్కన్యా
పుత్రవత్పాలితామయా
ఇదానీం, తవదాస్యామి
దత్తం, స్నేహేనపాలయాత్."

అన్ననాడు ఆ నాతిని స్వీకరించి; 'నాతి చరామి' అని అగ్నిసాక్షిగా ప్రమాణం చేసి,

ధర్మార్థ కామోక్షాలను ఆ స్త్రీ యెడల పొందుతానని బాస చేసిన శేషు ఇలా ప్రవర్తించాడు. ఎంతటి దాక్షిణ్యలోభం!

ఇలాంటి మంత్రయుక్తమైన పెండ్లికాదనే కదూ, మీ అత్తయ్య కరుణను అవమాన పరచింది.

నా ఆవేదనను భరించలేక నీకు వ్రాసాను. నిన్నూ బాధ పెట్టానేమో! మురారీ..... ఇంత జరిగి, మీ మామయ్య బ్రతికే వున్నాడు - నాయనా!

ఉంటాను,

నీ, మామయ్య.

మామయ్య జాబు జేబులో పెట్టుకొంటుండగా- "మన సంస్కృతి, చిత్త సంస్కారం. ఆ సంస్కారం నుండి ఉద్భవించే వేమన వివేక, వివేచనలు" అన్న కరుణ మాటలు జ్ఞాపకానికొచ్చాయి. ●

## కథ వెనుక కథ :

*ఈ కథకు ప్రేరణ స్వీయ జీవితంలోని అనుభవం. 1962 సం॥ నాటికింకా, మధ్య తరగతి కుటుంబాలలో, శాఖాంతర వివాహాలు 'కట్టుబాట్లను తెంచుకొంటోన్న విప్లవాలుగానే పరిగణింపబడుతున్నాయి. అలాంటి నా పెళ్ళికి, మా నాయనమ్మగారు రాలేదు. ఆమెగారు రాలేదన్న అసంతృప్తి లోనై, మా అమ్మగారు "నీ కిలా రాసిపెట్టి వుంది ఎవరేం చేస్తారు-" అన్నారు - (జరగవలసినంత వైభవంగా, శాస్త్రీయంగా నా పెళ్ళి జరగలేదన్న ధ్వనితో).*

*శాస్త్రీయంగా జరిగిన కొన్ని పెళ్ళిళ్ళ తీరు గమనించాక...*

★ *(నెలవంక మాసపత్రిక, అక్టోబరు, 1963)* ★